క్లుప్తంగా

మౌలిక వసతుల కల్పనపై దృష్టి



శిక్షణ పొందిన ఉప సర్పంచులు, వార్డు సభ్యులు

పాలసముద్రం : పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకూప ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు దృష్టి సారించాలని ఎంపీడీఓ విద్యావతి సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులకు రెండో రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీ పరిపాలన విధి విధానాలను వివరించారు. ప్రజల అవసరాల పనుల గుర్తించి సమస్యలపరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రమేష్ పాల్గొన్నారు.

రీ సర్వే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్

గంగాధర నెల్లూరు : రీసర్వేలో రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. రీస్వరేపై చేపట్టాల్సిన గ్రామసభల ఏర్పాట్లను సమీక్షించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామ సభ నిర్వహించే గ్రామాల్లో రెండు రోజుల ముందుగా దండోరా వేయించాలని ఆదేశించారు. ఆయా సభల్లో రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, సర్వేయర్ సునీత, రీ సర్వే డీటీ ఖాదర్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగునకు ఆదేశం



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న ఈఓ నాగరత్నమ్మ

కార్వేటినగరం : మండలకేంద్రంలో పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ చంద్రమౌళి ఆదేశించారు. గురువారం ఈ మేరకు ఆయన పలు వార్డులను సందర్శించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో చెత్తాచెదారాలు పేరుకోకుండా మురుగు కాలువలను శుభ్రం చేయాలన్నారు. తాగునీటి పైపులైన్లు లీకేజీ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఈఓ నాగరత్నమ్మ పర్యవేక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోపి పాల్గొన్నారు.

వరద ప్రాంతాల పరిశీలన



వరద ప్రాంతాలు పరిశీలిస్తున్న కమిషనర్ కృష్ణారెడ్డి

నగరి : మున్సిపల్ పరిధిలో వరద ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి గురువారం పరిశీలించారు. స్థానికులు సూచించిన మేరకు ఏయే ప్రాంతాల్లో మురుగునీటి కాలువల్లో పూడికతీయాలి. ఎక్కడ తాగునీరు, వీధి దీపాల సమస్య పరిష్కరించాలి అనే అంశాలను నమోదు చేసుకున్నారు. సమస్యలను త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, స్థానికులు కృష్ణారెడ్డి, జ్యోతినాయుడు, గుణశేఖర్, అశోక్ బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నపాటి చిట్కాలతో పంట రక్షణ



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

పెనుమూరు(కార్వేటినగరం) : వర్షం కారణంగా మునిగిన పంటలను చిన్నపాటి చిట్కాలతో రక్షించుకోవచ్చని ఏఓ మురళీకృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని కొండమ్మ అగ్రహారంలో మునిగిపోయిన రైతు శ్రీనివాసులురెడ్డి పంటను సందర్శించారు. మునిగిన గింజ మొలకెత్తకుండా రెండు గ్రాముల ఉప్పును ఒక లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పంట నష్టం వాటిల్లిన వారు రైతు సేవాకేంద్రంలో నమోదు చేయించుకోవాలని చెప్పారు. అనంతరం డీఆర్‌పీ నాగపద్మిని మాట్లాడుతూ వాణిజ్య పంటల సాగులో యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఏఓ పద్మజ, సంధ్యారాణి, కె.సుహర్లత పాల్గొన్నారు.

పక్కా గృహాలపై పక్షపాతం

- తాజా నిర్మాణాలకు మాత్రమే రూ.4 లక్షలు
- గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లపై వివక్ష



అర్ధంతరంగా నిలిచిపోయిన పక్కా ఇల్లు

విజయపురం : పేదల సొంతింటి కలను ప్రభుత్వం పీడకలగా మారుస్తోంది. పేదల ఇళ్ల నిర్మాణంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. గత ప్రభుత్వంలో మంజూరైన గృహాలపై వివక్ష చూపుతోంది. కొత్తగా మంజూరయ్యే గృహ నిర్మాణాలకు మాత్రమే ప్రభుత్వం అందించే రూ.4 లక్షలు ఆర్థిక సాయం వర్తిస్తుందని ప్రకటించింది. గతంలో మంజూరైన ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించకపోగా వారిపై కక్ష సాధింపులకు దిగుతోంది. ఇల్లు మంజూరైనా దాన్ని నిర్మించుకోలేక పేదలు అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వంలో మంజూరై, ప్రస్తుతం వివిధ దశల్లో నిర్మాణ పనులు సాగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిస్థితి ఏంటన్న ప్రశ్న తలెత్తుతోంది. ప్రభుత్వం ఏదైనా పక్షపాత ధోరణి అవలంబించడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నిస్తున్నారు. తమకు సైతం రూ.4 లక్షల ఆర్థిక సాయం వర్తింప చేయాలని కోరుతున్నారు.

నగరి నియోవర్గంలో 5,195 ఇళ్లు మంజూరు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో నిరుపేదలకు 1.50 సెంటు ఇంటి స్థలంతోపాటు ఇంటి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 5,195 ఇళ్లు కేటాయించగా అందులో 4,942 నివాసాల నిర్మాణం ప్రారంభమైంది. వీటిలో 2001 నివాసాల నిర్మాణం పూర్తి చేసుకొని జిల్లాలో మూడో స్థానంలో నిలిచింది. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. వీటన్నింటికీ అప్పటి ప్రభుత్వం సుమారు రూ.102.74 కోట్లు నిధులు కేటాయించగా అందులో రూ. 80.10 కోట్లు లబ్ధిదారులకు అందించారు. పార్టీలకు అతీతంగా ప్రతి పేద, బడుగు, బలహీన వర్గాలకే కాకుండా, కుల, మత బేధాలు లేకుండా అర్హత కలిగిన నిరుపేదలందరికీ ఇంటి స్థలం మంజూరు చేసింది. అంతటితో ఆగకుండా ఇంటి నిర్మాణం కోసం అందరికీ సమానంగా నిధులు అందజేసింది. జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల్లో భాగంగా విద్యుత్ సరఫరా, ఇంటికి అవసరమైన విద్యుత్ సామగ్రి, తాగునీరు, రోడ్డు, వీధి దీపాలు, ఇంటి సర్వీస్ కోసం కొన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం తాజా నిర్మాణానికి మాత్రమే రూ.4 లక్షలు ఇస్తామని ప్రకటించడం విమర్శలకు తావిస్తోంది. గత ప్రభుత్వంలో వివిధ దశలో ఆగిపోయిన ఇంటి కూడా రూ.4లక్షల పథకాన్ని వర్తింపు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రూ.4 లక్షలు ఇవ్వండి



గత ప్రభుత్వ హయాంలో ఇల్లు మంజూరైంది. ప్రస్తుతం 9 అడుగుల వరకు గోడల నిర్మాణం పూర్తి చేసుకుంది. అంతలోనే ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం సిమెంట్, కమ్మీ రేట్లు పెరిగిపోయాయి. సీఎం చంద్రబాబు ఎన్నికల్లో చెప్పినట్లు రూ.4 లక్షలు మంజూరు చేయాలి. కొత్తగా కట్టుకొనే వారికి మాత్రమే పథకాలు ఇవ్వడం సరికాదు.

– జయరామ్, విజయపురం

అందరికీ సమానంగా ఇవ్వాలి



గత ప్రభుత్వం సుమారు రూ. 4లక్షల విలువ కలిగిన ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.2లక్షలు ఇచ్చింది. మొత్తం రూ. 6లక్షలు లబ్ధిదారులకు అందించింది. పార్టీలకు అతీతంగా, కుల, మత బేధాలు లేకుండ అర్హత కలిగిన వారిరందరికీ ఇచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం అర్హత కలిగిన లబ్ధిదారులందరికీ రూ.4 లక్షలు మంజూరు చేసి న్యాయం చేయాలి

– రాజయ్య, వేపగుంట.

వైఎస్ జగన్‌ను కలసిన నారాయణస్వామి



తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలసిన మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, గంగాధర నెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి

– కార్వేటినగరం

ఓవర్‌హెడ్ ట్యాంకుల శుభ్రం



ట్యాంకును శుభ్రం చేయిస్తున్న సర్పంచ్

వెదురుకుప్పం : మండలంలోని తిరుమలయ్య పంచాయతీలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులను సర్పంచ్ భారతి ఆధ్వర్యంలో శుభ్రం చేయించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి నెలా తప్పనిసరిగా నీటి ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే పంచాయతీ పరిధిలో బోరు మోటార్లు మరమ్మతుకు గురైతే వెంటనే సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

పార్టీ శ్రేణులకు అండగా ఉంటాం



బాధితులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి రోజా

నింద్ర: మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. నెట్టేరి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత హేమాద్రి కుటుంబాన్ని గురువారం రోజా పరామర్శించారు. హేమాద్రి తల్లి కృష్ణమ్మ అనారోగ్యంతో వారం రోజుల క్రితం మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, కృష్ణమ్మ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభా, వైఎస్సార్ సీపీ యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్, జిల్లా కార్యదర్శి మేరి, ఎంపీటీసీ విజేష్, కో–ఆప్షన్ సభ్యులు అనిల్, మండల నాయకులు వేణురాజు, బాబు రెడ్డి, మునికృష్ణారెడ్డి, బసవయ్య, దేవా, సత్య రాజ్ పాల్గొన్నారు.

వదిలేస్తారా.. వాటాలిస్తారా?

- కూటమిలో చిచ్చు పెట్టిన వైన్‌షాపులు
- కమీషన్ల కోసం నేతల బేరసారాలు



పాఠశాల సమీపంలో మద్యం షాపు వద్దని ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కార్వేటినగరం : మండలంలోని కూటమి నేతల్లో వైన్‌షాపులు చిచ్చు పెట్టాయి. కమీషన్ల కోసం కలహాలు మొదలయ్యాయి. స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మొత్తం 8 మద్యం దుకాణాలు కేటాయించారు. అయితే ఇప్పటి వరకు కేవలం 5 షాపులు మాత్రమే ప్రారంభించారు. మొత్తం దుకాణాలను టీడీపీ నేతలే సిండికేట్‌గా మారి దక్కించుకున్నారు. అయితే ఆయా ప్రాంతాల్లో దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు సొంత పార్టీ నాయకుల నుంచే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తమకు వాటా ఇస్తేనే సజావుగా షాపు నిర్వహించుకోవచ్చని స్థానిక నేతలు తెగేసి చెబుతున్నారు. లేకుంటా షాపును వదిలేసుకోవాలని స్పష్టం చేస్తున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే మాటను సైతం లెక్క చేయడం లేదని తెలుస్తోంది. తమతో ఒప్పంద కుదుర్చుకోకుండా ఎవరైనా దుకాణం ప్రారంభిస్తే, అక్కడ బడి, గుడిని అడ్డుపెట్టుకుని స్థానిక మహిళలతో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే వైన్‌షాపుల ఏర్పాటులో నిబంధనలను గాలికి వదిలేస్తున్నారు. కొల్లాగుంట సమీపంలోని చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారికి కూతవేటు దూరంలోనే మద్యం దుకాణం నిర్వహించేందుకు టీడీపీ రాష్ట్రస్థాయి నేతతోపాటు ఆయన అనుచరులు యత్నిస్తున్నట్లు సమాచారం. అలాగే జీడీనెల్లూరు నియోజకవర్గంలోని మొత్తం 14 వైన్‌షాపుల్లో 20శాతం వాటా ఇవ్వాలని ఎమ్మెల్యే థామస్ డిమాండ్ చేస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతుండడం గమనార్హం.



సీఐకి వినతిపత్రం అందిస్తున్న స్థానికులు

లాభాల సిరి.. శ్రీవరి

- నవీన సాగు సులభతరం
- కూలీల సమస్యకు పరిష్కారం
- పెట్టుబడి తక్కువ దిగుబడి అధికం



యంత్ర సాయంతో వరి నాట్లు వేస్తున్న రైతు

నింద్ర: మండలంలో రైతులు ఆధునిక పద్ధతులో వరిని పండిస్తూ లాభాల బాటలో సాగుతున్నారు. ఎక్కువ మంది శ్రీ సాగు పద్ధతిలో వరిని పండించి అధిక దిగుబడిని సాధిస్తున్నారు. తద్వారా సాగు విధానాన్ని సులభంగా మార్చుకుంటున్నారు. కూలీల కొరత సమస్యను అధిగమిస్తున్నారు. విత్తనాల ఖర్చు తగ్గించుకుంటున్నారు. మొత్తంగా తక్కువ పెట్టుబడి పెట్టి సులభతర వ్యవసాయాన్ని అవలంబించి అధిక దిగుబడి సాధిస్తూ రైతులందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

సాధారణ సాగుకు పెట్టుబడి

రైతులు ఎకరంలో వరి పంట సాగు చేయడానికి 25 కిలోల విత్తనాలు అవసరం అవుతాయి. ఆ విత్తనాలు రూ.1,300కు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. దుక్కులు దున్నేందుకు, నాట్లకు కూలీల ఖర్చు రూ.6 వేల వరకు అవుతుంది. నాట్లు వేయడానికే రెండు రోజులు పడుతుంది. కలుపు తీత, ఎరువులు, క్రిమిసంహారక మందులకు రూ.20 వేలు వెచ్చించాల్సి ఉంటుంది. మొత్తానికి ఎకరా వరి పంట సాగుకు రూ.25 వేలకు మించిపోతుంది. ఆ తరువాత ఎకరాకు 30 బస్తాలు దిగుబడి వచ్చినా రైతుకు మిగిలేది తక్కువే. దీంతో విసిగిపోయిన రైతులు నూతన పద్ధతులను ఎంచుకున్నారు.

నవీన సాగు

రైతులు శ్రీ సాగు పద్ధతిలో వరిని పండిస్తే కేవలం 12 కిలోల విత్తనాలు ఎకరాకు సరిపోతాయి. దీంతో విత్తనాల ఖర్చు రూ.650 తగ్గిపోయినట్లే. ఇక నాట్లు వేయడానికి కూలీలతో పని లేకుండా యంత్రాలను వినియోగించడం వల్ల పని త్వరగా సులభంగా అయిపోతోంది. ఎకరా భూమిలో వరి నాట్లు వేయడానికి రెండు గంటలు సరిపోతుంది. పైగా యంత్రానికి ఎకరానికి రూ.3,500 మాత్రమే వెచ్చించాలి. ఇలా ప్రతి పనిలోనూ తక్కువ ఖర్చుతో పంట సాగు చేయవచ్చు. గతంలో ఎకరా సాగుకు రూ.25 వేలు ఖర్చయితే, శ్రీ సాగు విధానంలో రూ.15 వేలకు మించి అవసరం లేదు.

ఆశించిన దిగుబడి

సాధారణ సాగులో ఎకరాకు 30 బస్తాల వరకు దిగుబడి వస్తే, ఈ ఆధునిక సాగు పద్ధతిలో 40 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. దీంతో రబీ, ఖరీఫ్ రెండు సీజన్లలోనూ రైతులు ఈ వరి సాగు పైనే రైతులు అసక్తి చూపుతున్నారు. ధాన్యం ధర కూడ గతంలో కంటే పెరిగింది. గతంలో బస్తా రూ.800 నుంచి 900 వరకు పలికేది. ఇప్పుడు బస్తా రూ.1700 వరకు పలుకుతుండడంతో రైతులకు గిట్టుబాటు అవుతోంది. ఖర్చు తగ్గుతోంది. దిగుబడి పెరుగుతోంది. అందుకే రైతులు శ్రీ సాగు పద్ధతిలో వరి పండించడానికి మక్కువ చూపుతున్నారు.

వరి సాగు లాభదాయకం



ఆధునిక పద్ధతులపై వరి సాగు చేయడం వలన ఎంతో సౌకర్యంగా వుంది. గతంలో వరి సాగు కోసం ఎంతో కష్టాలు పడేవాళ్లం. కూలీల కొరతతో ఇబ్బందులు పడేవాళ్లం. నాట్లు వేయడానికి, కలుపు తీయడానికి ఎంతో కష్టపడేవాళ్లం. నేడు ఆధునిక పద్ధతిలో నాట్లు, కలుపు మందుల వాడకం వలన చాలావరకు సులభంగా వ్యవసాయం చేయగలుగుతున్నాం.

– వీరయ్య, రైతు, చవరంబాకం

యంత్రాలతో సేద్యం



వరి పండించేందుకు శ్రీ సాగు పద్ధతిని అనుసరిస్తున్నాం. దీంతోపాటు ఆధునిక యంత్రాలను వినియోగిస్తున్నాం. గతంలో వరి సాగు కోసం 20 రోజులు పట్టేది. ఇప్పుడు కేవలం నాట్లు వేయడానికి ఎకరాకు 2 గంటలు పడుతోంది. నాట్లు వేసే యంత్రాలు రావడంతో పని చాలా వేగంగా అయిపోతోంది. అదే సమయంలో ఖర్చు కూడా తగ్గిపోతోంది. అందుకే ఈ సేద్యం చేస్తున్నాం.

– రాజు, రైతు మిట్టూరు

పరిపూర్ణం.. మహా కుంభాభిషేకం

కార్వేటినగరం : ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన మహా కుంభాభిషేకం గురువారంతో పరిపూర్ణమైంది. ఈ సందర్భంగా పండితులు వైదిక కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ప్రధాన గోపురంపై ప్రతిష్టించనున్న మహా కలశాన్ని మాడ వీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. అనంతరం పవిత్ర జలాలతో సంప్రోక్షణ చేసిన అర్చకులు మహా కుంభాభిషేకం జరిపించారు.

రథోత్సాహం

కార్వేటినగరంలో కరణిక కులస్తులు రూ. 16 లక్షలతో తయారు చేయించిన నూతన రథంపై స్వామి, అమ్మవార్లు ఊరేగారు. దాతలు దేవేంద్ర పిళ్లై, జ్యోతి దంపతులను వేద పండితులు సత్కరించారు. ఎంపీపీ లత, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బాలాజీ దంపతులు సుమారు వెయ్యిమంది భక్తులకు అన్నదానం చేశారు.



రథంపై ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

వర్షం.. పంట నష్టం



విజయపురం: ఆముగుంటలో నీట మునిగిన మినుము పంట



గంగమాంబపురంలో నేలకొరిగిన వరి



కాళికాపురంలో నేలకొరిన వరి పంట

విజయపురం : మండలంలో రెండు రోజులపాటు కురిసిన వర్షానికి పంటలు నీటమునిగాయి. మరి కొన్ని చోట్ల కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. కాళికాపురంలో కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట నేలకొరిగింది. ఆముగుంటలో మినప పంట నీట మునిగింది. రైతులు అప్పులు చేసి సాగు చేసిన పంటలు ఈ వర్షానికి కొట్టుకుపోయి, నష్టాల్లో మునిగిపోయారు. ఇప్పటివరకు అధికారులు ఎవరూ అటు వైపు రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాలసముద్రం : మండలంలో మూడు రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలోని వరి, చెరుకు పంటలకు తీవ్రమైన నష్టం వాటిల్లింది. చేతి కందే దశలో పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



డీడీఓ రమణయ్యను సన్మానిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్

వెదురుకుప్పం : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కార్యదర్శులు కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ తెలిపారు. గురువారం మండలంలోని మాంబేడు గ్రామ సచివాలయంలో డీడీఓగా బాధ్యతలు చేపట్టిన రమణయ్యను ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌బీకే చైర్మన్ కేశవులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి ఐవీ స్టాండ్స్ వితరణ



ఆస్పత్రికి ఐవీ స్టాండ్లు వితరణగా అందిస్తున్న దాత

నగరి : స్థానిక సిరీడ్స్ మానసిక దివ్యాంగుల పాఠశాల జనరల్ సెక్రటరీ ఆర్.గిరిజ ఏరియా ఆస్పత్రికి ఐవీ స్టాండ్లను వితరణగా అందించారు. గురువారం ఆస్పత్రికి వెళ్లిన ఆమె ఐవీ స్టాండ్లను ఆర్‌ఎంవో కార్తిక్ సమక్షంలో ఆస్పత్రికి అందించారు. ఆస్పత్రిలోని రోగులకు ఉపయోగపడే ఐవీ స్టాండ్లను ఉచితంగా అందించిన దాతకు ఆర్‌ఎంవో ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి హెడ్ నర్స్, సిబ్బంది పాల్గొన్నారు.